# క్లాసు - గ్లాసు

ఎండలు మండిపోతున్నాయ్. ఆఫీసులో వేసవి ఏర్పాటు హడావుడిగా జరుగుతున్నాయి. కొత్త గాజుగ్లాసులు పుచ్చుకొని ఫ్యూను అందరికీ పంచుతూ సంతకాలు పెట్టించుకుంటున్నాడు.

రంగుల ‘‘పువ్వుల గ్లాసులు సూపర్‌వైజర్లకి, సాదా గ్లాసులు గుమస్తాలకి అని విశదమయ్యాక గుమస్తాలందరికీ ఒక్కసారి కోపమొచ్చింది.

వారిలో నారాయుడు ముందుకొచ్చి సూపర్‌వైజర్ల దగ్గరకెళ్ళి అయ్యా ! మీరూ. మేమూ తాగేవి మంచినీళ్ళే! మీకూ మాకూ తేడా ఉద్యోగరీత్యా వుందేమో కాని మంచినీళ్ళు తాగే గ్లాసుల్లో ఎందుకూ ?’’ అన్నాడు కాస్త వుద్రేకంగా.

దానికి సదరు సూపర్‌వైజర్లు నొచ్చుకుని ‘‘మాకేమీ తెలీదు. మేం పువ్వుల కోసం అడగలేదు. కావాలంటే మా గ్లాసులు మీరు తీసేసుకొని వాడుకోండి’’ అన్నారు.

కాని దానికి వాళ్ళు ఒప్పుకోలేదు.

ఆఫీసు మొత్తానికి గ్లాసులు కొనుగోలు చేసిన సూపర్నెంటెంట్‌గారి పీకకి చుట్టుకుంది విషయం.

"ఇది ఎన్నాళ్ళుగానో వస్తున్న ఆచారం. దీన్ని మార్చటం అంత మంచిది కాదు" అని హితవు చెప్పబోయారు ఆయన.

"అది దురాచారం" అంటూ మొత్తం అందరూ కలసి ఆఫీసర్ గార్ని కలుసుకున్నారు. వాదించారు. చర్చించారు. గ్లాసులు తీసుకోము అని ప్రకటించి వచ్చేశారు.

o o o

స్నానం చేసి విశ్రాంతిగా మంచంమీద పడుకున్నాడు. నారాయుడు. వాళ్ళావిడ తళ తళ మెరిసే స్టీలు సామానుతో యింట్లోకి అడుగు పెట్టింది.

"ఇదిగోనండీ! స్టీలు బిందె. ఇవిగో పిల్లలకీ, మీకూ, నాకూ గ్లాసులు, ఇంకా ఒక చెంబు, కంచం."

గ్లాసుల కట్టలో ఒక సత్తుగ్లాసు చూసి నారాయుడు విసుగ్గా ముఖం పెట్టి "ఇదెందుకూ?" అన్నాడు.

"రోజూ మన రత్తాలు కాఫీ కాఫీ అంటుంది. మన గ్లాసులతో యివ్వాల్సి వస్తోందని వొక సత్తుగ్లాసు కొని పడేశాను" అంది.

ఆఫీసులో ఐ. ఏ. ఎస్. ఆఫీసరుతో అరగంట వాదించిన నారాయుడు అయిదో క్లాసు ప్యాసవని భార్యముందు అరనిమిషం వాదించలేక మౌనంగా ఉండిపోయాడు.

(చతుర మాసపత్రిక నుండి)